Office Of The Advisor (communications)
Govt. Of Andhra Pradesh

# అత్యాచారాల కేసుల విచారణకు ప్రత్యేక న్యాయస్థానాలు

## అప్పుడే ఆడవారిపై వేధింపులు తగ్గుతాయన్న గవర్నర్ నరసింహన్

## ఇంట్లో మహిళే బెస్ట్ హోమ్మినిస్టర్ : చంద్రబాబు

## కుటుంబ ఊతంతోనే ఎదిగామన్న జస్టిస్ రోహిణి, నారా బ్రాహ్మణి

అమరావతి, ఫిబ్రవరి 11 : మహిళలపై జరుగుతున్న అత్యాచారాలకు సంబంధించిన కేసుల్ని త్వరగా విచారణ చేపట్టి దోషులను శిక్షించేందుకు ప్రత్యేక న్యాయస్థానాలు ఉండాలని ఉమ్మడి తెలుగు రాష్ట్రాల గవర్నర్ ఇఎస్ఎల్ నరసింహన్ అభిప్రాయపడ్డారు. న్యాయస్థానాలలో విచారణ సమయం తగ్గి దోషులకు త్వరగా శిక్షలు పడితేనే ఆడవారిపై వేధింపులు తగ్గుతాయని ఆయన చెప్పారు. ఈ విషయంలో మీడియా ధోరణి కూడా మారాలని, అత్యుత్సాహంతో అత్యాచార కేసుల్లో మీడియాలో చూపిస్తే వారిని కూడా విచారించే పరిస్థితి రావాలని గవర్నర్ అన్నారు. అమరావతి పవిత్ర సంగమ క్షేత్రంలో జరుగుతున్న తొలి జాతీయ మహిళా పార్లమెంట్ రెండవ రోజు సదస్సులో ఉమ్మడి రాష్ట్రాల గవర్నర్ ముఖ్యఅతిధిగా పాల్గొని కీలక ప్రసంగం చేశారు.

ఇంట్లో ఆడపిల్ల పుట్టగానే ఆమెను లక్ష్మిగానే భావించే ఆలోచనా ధోరణి మారాలని గవర్నర్ చెప్పారు. నిజానికి మహిళలకు బహు రూపాలున్నాయని, వాటిని గుర్తించి ప్రోత్సహించాలని అన్నారు. ఆమెను కేవలం ధనలక్ష్మిగా మాత్రమే చూడకుండా ధైర్యలక్ష్మిగా గుర్తించాలని సూచించారు. భారతీయ సమాజంలో మహిళలకు అత్యంత ప్రాధాన్యమిస్తూ పండుగలు కూడా వున్నాయని, రక్షాబంధన్ ఆ తరహా వేడుకేనని గుర్తుచేశారు. మహిళను గౌరవించడాన్ని మనసా, వాచా, కర్మేణ ఆచరణలో పెట్టాలని హితవు పలికారు.

మహిళా సాధికారిత అంటే మగవారితో సమానంగా వారికి అవకాశాలు కల్పించడమే గవర్నర్ అన్నారు. అవకాశాలు కల్పించడంతో పాటు బృంద నిర్ణయం తీసుకునే పరిస్థితి ఉండాలన్నారు. రెండు భిన్న ధృవాల మధ్య ఉన్న అభిప్రాయాలను ఒక్కటిగా ఆలోచించటంలోనే మహిళా సాధికారిత దాగుందని గవర్నర్ చెప్పారు. మహిళా పార్లమెంటు న్యూస్ బులెటిన్‌ను ఈ సందర్భంగా ముఖ్యమంత్రితో కలిసి గవర్నర్ విడుదల చేశారు.

### సవాళ్లు ఎదురైనా శతాబ్ది మనదే : జస్టిస్ రోహిణి

మహిళల సాధికారత కోసం ఎన్ని చర్యలు తీసుకుంటున్నా, కొత్త సవాళ్లు ఎదురవుతూనే ఉన్నాయని ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జి. రోహిణి అన్నారు. సవాళ్లను అవకాశాలుగా మలుచుకునే స్థాయికి మహిళలు ఎదగాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. లింగ వివక్షను పూర్వ కాలం నుంచి మహిళలు ఎదుర్కొంటూనే ఉంటున్నారని, మహిళలు సంపాదనాపరులైనా వారికి ఆర్థిక స్వాతంత్ర్యం రావడం లేదని, నిర్ణయాల్లో ఇప్పటికీ మహిళలకు స్వేచ్ఛ ఉండడం లేదని చెప్పారు.

సమాజంలో మరుగున పడిన అంశాలను గురించి మాట్లాడుకునే పరిస్థితులు ఇప్పుడున్నాయని, గతంలో అలాంటి అవకాశాలూ వుండేవి కావని జస్టిస్ రోహిణి అన్నారు. మహిళా రిజర్వేషన్ల కారణంగానే జడ్జిని కాగలిగానని గుర్తుచేశారు. ప్రస్తుత సమాజంలో మహిళలు అనేక సమస్యలను సమర్థంగా ఎదుర్కొంటూ అన్ని రంగాల్లో రాణిస్తున్నారని చెప్పారు. మహిళా సాధికారత, మహిళా అభ్యున్నతి గురించి మరింత చర్చ జరగాలని ఆమె చెప్పారు. స్త్రీ పురుష సమానత్వం గురించి వేదికలపై మాట్లాడుకుంటున్నా క్షేత్రస్థాయిలో అలాంటి పరిస్థితులు కనిపించడం లేదని ఆవేదన వెలిబుచ్చారు. పని చేసే చోట వేధింపులు తప్పడం లేదని, సౌకర్యాల లేమి సమస్య వుండనే వుందని జస్టిస్ రోహిణి చెప్పారు. సమాన హక్కులతో పాటు, వివక్షను దూరం చేసేలా కార్యక్రమాలు, ఆలోచనా ధోరణులు మారాల్సివుందని అన్నారు. అప్పుడే మహిళలకు అసలైన సాధికారత వచ్చినట్టుగా భావించవచ్చునని చెప్పారు.

ఆడపిల్లకు జన్మనివ్వటం అవరోధం అవుతుందనే అభిప్రాయం నుంచి, అసలు అటువంటి ఆలోచనా ధోరణి నుంచి బయటపడాలని జస్టిస్ రోహిణి హితవు చెప్పారు. కుటుంబం నుంచి ప్రతి మహిళకు మంచి సహకారం లభించాలని అన్నారు. అటువంటి ప్రోత్సాహం, ఊతం తనకు తన కుటుంబం నుంచి లభించిందని గుర్తుచేసుకున్నారు. తాను ఈ స్థాయికి రావడానికి ప్రధాన కారణం తన కుటుంబమేనన్నారు.తన తండ్రి పదవి విరమణ తరువాత ఎక్కడ స్థిరపడాలని ప్రణాళిక వేసుకున్నప్పుడు విశాఖ అని అందరూ సూచించినా, తన కోసమే హైదరాబాదులో వుండాలని నిర్ణయం తీసుకున్నారని చెప్పారు.

## ఏపీ నుంచే మహిళా సాధికారత: ముఖ్యమంత్రి చంద్రబాబు

‘మహిళలు తలచుకుంటే ఏదైనా సాధించగలరు. సమాజంలో నిర్ణయాత్మక శక్తి మహిళే’నని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉద్ఘాటించారు. కుటుంబం నుంచి సరైన సహకారం ఉంటేనే మహిళలు ముందడుగు వేయగలుగుతారని చెప్పారు. కుటుంబ ఆర్థిక వ్యవహారాల నిర్వహణ

కష్టతరమన్న ముఖ్యమంత్రి–ప్రతి స్త్రీమూర్తి తన కుటుంబ ఆర్థిక పరిస్థితులను, ఆదాయ వ్యయాలను ఆకళింపు చేసుకుని ఎంతో సమర్థంగా కుటుంబ ఆర్థిక నిర్వహణ చేయగలుగుతోందని ప్రస్తావించారు. బెస్ట్ హోమ్ మినిస్టర్ ఎవరంటే ఇంట్లో మహిళేనని అన్నారు. మహిళలు ఎవరికీ తీసిపోరన్న విశ్వాసం కలిగి ఉండాలని పిలుపునిచ్చారు. మహిళలు ఎవరికంటే తక్కువ కాదని, అన్ని రంగాలలో పురుషులతో సమానంగా, ఒక్కోచోట అధికంగా దూసుకుపోతున్నారని చెప్పారు. విజ్ఞాన సమాజంలో స్త్రీ పురుషులు ఇరువురూ సమానమేనని అన్నారు. ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ వంటి సాంకేతిక అంశాల్లో మహిళలదే ముందు నేర్చుకోగలుగుతున్నారని చెప్పారు. దురదృష్టం కొద్దీ చట్ట సభల్లో మహిళా ప్రాతినిధ్యం తక్కువగా ఉందని, అధికారుల్లోనూ ఈ శాతం తక్కువే వున్నదని అన్నారు.

మహిళా పార్లమెంట్ సదస్సు నిర్వహణ గురించి ఐవీఆర్ఎస్ ద్వారా అందరి అభిప్రాయాలను తెలుసుకుంటున్నానని, సదస్సు నిర్వహణ పట్ల అందరూ సంతృప్తి వ్యక్తం చేయడం సంతోషంగా వున్నదని ముఖ్యమంత్రి చెప్పారు. 10 వేల మందికి ఆహ్వానాలు పంపిస్తే 22 వేల మంది రావడమే అపూర్వమని, సాధికారత పట్ల మహిళలు ఎంత ఆసక్తి కనబరుస్తున్నారో దీన్ని బట్టే అర్థం అవుతోందని అన్నారు. మహిళా సమస్యలకు విమెన్ పార్లమెంట్ సహాయపడుతుందా అని అభిప్రాయ సేకరణ కోరితే 85 శాతం అవునని చెప్పారని తెలియజేశారు. ఈ సదస్సు ఇచ్చిన స్ఫూర్తితో అమరావతిలోనే మళ్లీ మహిళా పార్లమెంటు నిర్వహించాలని నిర్ణయించామని చెప్పారు. రాష్ట్రంలో ప్రతి ఏటా ఇలాంటి సదస్సులు నిర్వహించడానికి వీలుగా ఒక ఈవెంట్ మేనేజిమెంట్ కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్ నుంచే మహిళా సాధికారత ఆరంభం అవుతుందని, అది కూడా అమరావతి నుంచే మొదలవుతుందని అన్నారు.

## ఐక్యరాజ్యసమితితో ఎంవోయూ

ఐక్య రాజ్య సమితి మహిళా విభాగంతో రాష్ట్ర ప్రభుత్వం ఒక అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ప్రకారం మహిళలకు సంబంధించి ప్రభుత్వం ఖర్చు చేసే నిధులకు ఐక్యరాజ్య సమితి మహిళా విభాగం సహకారం అందించనున్నది. స్త్రీ పురుష సమానత్వంతోనే సమాజాలు ఆర్థికంగా వృద్ధి చెందుతాయని ఐక్య రాజ్య సమితి మహిళా విభాగం ప్రతినిధి ఆసా టొర్కెల్సన్ చెప్పారు. ఆనందమయ సమాజానికి ఇది పునాదులు వేస్తుందని అన్నారు. లింగ వివక్ష కలిగిన సమాజాలు వృద్ధి చెందవని తేల్చిచెప్పారు. ఐరాస సుస్థిరాభివృద్ధి లక్ష్యాలలోనూ మహిళా సాధికారిత గురించే ప్రధానంగా నిబంధన రూపొందించామని ఆమె తెలిపారు.

## అత్యాచారాలపై చర్చతో అనర్థాలు: వైఎస్ చౌదరి

మహిళలను దేవతలుగా కొలిచే దేశం మనదని కేంద్ర శాస్త్ర వైజ్ఞానిక శాఖ సహాయ మంత్రి వై ఎస్ చౌదరి చెప్పారు. మహిళలపై అత్యాచారాలు జరుగుతున్న అంశం వాస్తవమే అయినప్పటికీ, వీటిపై చర్చిస్తున్న కొద్దీ వారిలో ఆత్మ విశ్వాసం సన్నగిల్లుతోందని ఆయన అభిప్రాయపడ్డారు. పండ్ల బుట్టలో పుచ్చనవి కొన్ని ఉండటం సహజమేనని, మొత్తం బుట్టను తప్పుబట్టలేమని అన్నారు.

అమెరికాలో కూడా స్త్రీల పట్ల వివక్ష ఉందని, మన దేశంలో కంటే అమెరికాలోనే వివక్ష ఎక్కువగా వున్నదని కేంద్ర మంత్రి గుర్తుచేశారు. స్త్రీ–పురుషులు పరస్పరం సహకరించుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. మహిళల్లోనూ ఆలోచనాధోరణి మారాలని, స్వేచ్ఛ, స్వాతంత్ర్యాల గురించి మాట్లాడుకునే పరిస్థితి రావాలని చెప్పారు. ప్రస్తుతం దేశమంతటా మహిళా సాధికారిత గురించి మాట్లాడుకోవటం సంతోషం కలిగించే అంశమని అన్నారు. మహిళా సాధికారత కోసం మహిళలూ పెద్ద ఎత్తున పోరాడాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రతి ఇంటిలోనూ మహిళే కింగ్ మేకర్ అని వ్యాఖ్యానించారు. ప్రస్తుతం మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో ఉన్నారని తెలిపారు. కొంతమంది మహిళల నుంచి జాతి యావత్తూ స్ఫూర్తి పొందుతోందన్నారు. సమాన అవకాశాలు కల్పించటంలో కేంద్ర మంత్రిగా తన వంతు ప్రయత్నం చేస్తానని ఆయన హామీఇచ్చారు.

## లింగవివక్ష లేని సమాజం అవసరం: మధుసూదనాచారి

దేశంలో అనాదిగా స్త్రీ పురుషుల మధ్య వున్న వివక్షను ఇప్పటికైనా తొలగించుకోవాలని తెలంగాణా రాష్ట్ర విధానసభ సభాపతి మధుసూధనాచారి పిలుపునిచ్చారు. మహిళలు మౌన ప్రేక్షకులనే ముద్ర తొలగించుకోవాలని అన్నారు. అన్నింటా మహిళల భాగస్వామ్యం పెంపు దిశగా పరిస్థితులు మారాలని అభిప్రాయపడ్డారు. లింగవివక్ష లేని సమాజం అవసరమని అన్నారు. కేరళలో మహిళలకు ఎక్కువ సాధికారత లభిస్తోందని, ఇలాంటి పరిస్థితే ఇతర రాష్ట్రాల్లోనూ రావాలని మధుసూదనాచారి సూచించారు.

## చంద్రబాబు మహిళా పక్షపాతి: సాగరికా ఘోష్

దేశంలో మహిళలపై అరాచకాలు పూర్తిగా తొలగేలా కృషి చేయాలని టైమ్స్ ఆఫ్ ఇండియా కన్సల్టెంట్ ఎడిటర్ సాగరికా ఘోష్ పిలుపునిచ్చారు. జాతీయ మహిళా పార్లమెంటులో ఆమె ఉత్తేజిత ప్రసంగం చేశారు. మహిళలు ఎప్పటికప్పుడు కొత్త విషయాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. సంస్కృతి, సంప్రదాయాలను అనుసరిస్తూనే కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టాలన్నారు. విద్యలోనే

కాకుండా వీలైన అన్ని రంగాలలోనూ మహిళాశక్తి ముందుండాలని అన్నారు. మహిళా పార్లమెంటును నిర్వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును ఆమె మహిళా పక్షపాత ముఖ్యమంత్రిగా అభివర్ణించారు. దేశంలో ఇంతమంది మహిళా ముఖ్యమంత్రులు వున్నా ఎవరూ కూడా ఈ ఆలోచన చేయలేక పోయారని గుర్తుచేశారు.

## ఎన్టీఆర్ బాటలోనే చంద్రబాబు: నారా బ్రాహ్మణి

అమెరికాలో ఇప్పటికీ వివక్ష ఉందంటూ, ఇటీవల జరిగిన యూఎస్ ఎన్నికలే దానికి నిదర్శనమని హెరిటేజ్ ఫుడ్స్ డైరెక్టర్ నారా బ్రాహ్మణి అన్నారు. తొలి జాతీయ మహిళా పార్లమెంటును ఉద్దేశించి ఈ యువ వ్యాపారవేత్త చేసిన ప్రసంగం అందర్నీ ఆకట్టుకుంది. తల్లి పేరును ముందుపెట్టుకుని ఈ ప్రాంతాన్ని పాలించిన చక్రవర్తి గౌతమీపుత్ర శాతకర్ణి ఈ ప్రాంతానికి ఆదర్శమని, ఇలాంటి ప్రాంతంలో మహిళా పార్లమెంటు నిర్వహించటం ఆనందదాయకమని అన్నారు. మహిళా సాధికారిత అనేది కుటుంబం నుంచే ప్రారంభం కావాలని, అది తన కుటుంబంలో అమలవుతోందని చెప్పారు. ‘మా ఇంట్లో స్త్రీలకు గౌరవం ఇచ్చే మంచి వాతావరణం ఉంది. ఎన్టీఆర్ మనవరాలిగా పుట్టడం, చంద్రబాబు కోడలనవ్వడం గర్వంగా ఉంది’–అని బ్రాహ్మణి అన్నారు. ఆస్తిలో మహిళలకు సమాన హక్కు కల్పించిన ఘనత ఎన్టీ రామారావుదేనని గుర్తుచేశారు. పద్మావతి యూనివర్సిటీ పేరుతో మహిళల కోసమే దేశంలో తొలి విశ్వ విద్యాలయాన్ని స్థాపించింది ఎన్టీఆరేనని ప్రస్తావించారు. ఎన్టీఆర్ అడుగుజాడల్లోనే ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నడిచారని, డ్వాక్రా మహిళలను పెద్దఎత్తున ప్రోత్సహించారని అన్నారు. మహిళా సాధికారత కోసం కృషి చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబేనని అంటూ, ఆయన్ని ఫెమినిస్ట్ చీఫ్ మినిస్టర్ అనడాన్ని అంగీకరిస్తానని చెప్పారు. ఢిల్లీ హైకోర్టు మొదటి మహిళా ప్రధాన న్యాయమూర్తి తెలుగువారే కావడం గర్వకారణమని బ్రాహ్మణి అన్నారు. ఎవరో వచ్చి ఆదుకుంటారని ఎదురుచూడకుండా పరిస్థితుల్ని అనుకూలంగా మలచుకోవాలని చెప్పారు. అవకాశాల కోసం ఎదురు చూడకుండా వాటిని అందిపుచ్చుకోవటంలోనే సాధికారిత సాధ్యమవుతుందని భావిస్తున్నానని అన్నారు. ముఖ్యంగా అక్షరాస్యతతోనే ఇది సాధ్యమవుతుందని చెప్పారు. తమ సమస్యలను తామే పరిష్కరించుకునే స్థాయికి మహిళలు చేరుకోవాలంటే విద్య అవసరమన్నారు.

మహిళలు నిర్ణయాధికారాన్ని తీసుకునేలా ధైర్య సాహసాలను కలిగివుండాలని యూపీఎస్సీ మాజీ చైర్మన్ ఆల్కా సిరోహి తన అభిప్రాయాన్ని చెప్పారు. ప్రతి అంశాన్నీ ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని వనితలకు పిలుపునిచ్చారు.

సమాన అవకాశాలున్నాయని రాజ్యాంగమే చెబుతున్నా క్షేత్ర స్థాయిలో ఆ తరహా పరిస్థితులు లేనే లేవని కేరళ డిప్యూటీ స్పీకర్ శైలజా టీచర్ ఆవేదన వెలిబుచ్చారు. పనిచేసే ప్రతిచోటా మహిళలకు వేధింపులు ఎదురవుతూనే ఉన్నాయని, ఎక్కడా స్వేచ్ఛాయుత వాతావరణం లేనే లేదని ఆమె చెప్పారు. పౌరురాలిగా, కుటుంబ సభ్యురాలిగా మహిళలు నిరంతరం సమస్యలతో పాటు వివక్షతను ఎదుర్కొంటున్నారని అన్నారు.

జనాభాలో సగం ఉన్న మహిళలు తమ అవకాశాలను తామే సృష్టించుకోవాలని సీఐఐ చైర్ పర్సన్ వనిత దాట్ల చెప్పారు. అవకాశాలను అందిపుచ్చుకుని కుటుంబానికి, సమాజానికీ ఆదర్శప్రాయంగా నిలవాలని అన్నారు. ప్రతి మహిళా తనలో అపారమైన శక్తియుక్తులు దాగి ఉన్నాయని గుర్తించాలన్నారు. వాటిని వినియోగించుకుంటే సమాన అవకాశాలు అందుకున్నట్టేనని వనిత దాట్ల చెప్పారు. ఇంకా, ఈ సదస్సులో దేశ విదేశాల నుంచి వచ్చిన అనేకమంది ప్రతినిధులు మాట్లాడారు.